




డిటి మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు, ఆశాకార్యకర్తలు, తదితరులు



పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి బాబా రథోత్సవం

శతసాయి ఉత్సవం

వైభవంగా సత్యసాయి బాబా జయంత్యుత్సవాలు

బాబా బంగారు విగ్రహంతో రథోత్సవం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు

నేడు పుట్టపర్తికి ప్రధాని నరేంద్ర మోడీ

ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతిధి/ పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి బాబా శతయజయంతి వేడుకలు పుట్టపర్తిలో అంగరంగ వైభవంగా జరగుతున్నాయి. రథోత్సవంతో ఉత్సవ వేడుకలు మంగళవారం నాడు మొదలయ్యాయి. ప్రముఖులు, ప్రజప్రతినిధులు, దేశ విదేశాల నుంచి వచ్చిన బాబా భక్తుల నడుమ రథోత్సవం కనులపండువగా సాగింది. వెండి రథంపై సత్యసాయి బాబా 9 కేజీల బంగారు విగ్రహ ఉత్సవమూర్తిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. సత్యమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం బాబా ఉత్తర గోపురం వరకు కొనసాగింది. రథోత్సవానికి ముందుబాగాన కోలాటాలు, కళాజాత, కీలుగుర్రాలు, డప్పు, మంగళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రథోత్సవ వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, సవిత, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ దంపతులు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ మురళీ మోహన్, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. వెంకయ్య నాయుడు, మంత్రులు సత్యసాయి ట్రస్టు సభ్యులతో కలిసి రథాన్ని లాగి రథోత్సవాని ప్రారంభించారు. రథోత్సవం వేడుకను తిలకించేందుకు పుట్టపర్తి ప్రజలతో పాటు దేశ, విదేశాల్లోని బాబా భక్తులు పెద్ద సంఖ్యలో పుట్టపర్తికి విచ్చేశారు. సాయికుల్వంత్ హాలులో సత్యసాయిబాబా మహాసమాధిని వెంకయ్యనాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి

ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ పర్యటనకు రాష్ట్రం నుంచి నోడల్ అధికారులుగా కృష్ణబాబు, వీరపాండియన్‌తోపాటు పుట్టపర్తి కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయన్నది మంగళవారం నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పర్యవేక్షించారు. బహిరంగ సభ జరుగుతున్న హిల్ వ్యూ స్టేడియంలో ఎక్కడా ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగే విధంగా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు.

పుట్టపర్తికి చేరుకున్న ప్రముఖులు


సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ బుధవారం విచ్చేస్తున్న సందర్భంగా మంగళవారం నాడే ప్రముఖులు పుట్టపర్తికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం పుట్టపర్తికి చేరుకున్నారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా విచ్చేశారు. వీరితోపాటు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విచ్చేశారు. అదే విధంగా సినీ నటి ఐశ్వర్యరాయ్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ పుట్టపర్తికి చేరుకున్నారు. ఈసందర్భంగా వారు బాబా సమాధిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బుధవారం జరిగే బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొననున్నారు. వీరితోపాటు రాష్ట్ర మంత్రులు పలువురు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు.

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం

సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం పుట్టపర్తికి విచ్చేయనున్నారు. ఆయన పర్యటన సందర్భంగా అన్ని రకాల ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. సత్యసాయి బాబా వందవ జయంతి ఈనెల 23వ తేది జరుగనుంది. ఈ సందర్భంగా గడిచిన వారం రోజులుగా ఉత్సవాలు పుట్టపర్తిలో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పెద్దఎత్తున ప్రముఖులు పుట్టపర్తికి విచ్చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం రోజు ప్రధాని నరేంద్ర మోడీ పుట్టపర్తికి విచ్చేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఆయన పుట్టపర్తి విమనాశ్రయం చేరుకుంటారు. ఆయనకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తోపాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులు మంగళవారం సాయంత్రానికే పుట్టపర్తికి చేరుకున్నారు. స్వాగత కార్యక్రమాలు పూర్తయిన తరువాత నేరుగా ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులోని ఆయన మహాసమాధిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉదయం 10 గంటలకు సందర్శించనున్నారు. అనంతరం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా జీవితం, బోధనలు, శాశ్వత వారసత్వాన్ని స్మరించేందుకు రూపొందించి స్మారక నాణెం, తపాల స్టాంపుల సమితిని విడుదల చేస్తారు. అనంతరం ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల్లోపు ఈ కార్యక్రమాన్ని ముగించుకుని పిఎంకిసాన్ పథకాన్ని ప్రారంభిం చేందుకు తమిళ నాడులోని కోయం బత్తూరుకు ప్రధాని బయలుదేరి వెలుతారు.



బాబా మహాసమాధి దర్శనానికి వెళ్తున్న వెంకయ్య నాయుడు



సచిన్ టెండుల్కర్‌తో మంత్రులు లోకేష్, పయ్యావుల కేశవ్



బాబా మహాసమాధి వద్ద నివాళి అర్పిస్తున్న ఐశ్వర్యరాయ్

బాలికపై ఆత్యాచారయత్నం

కేసు దర్యాప్తులో పోలీసుల తీరుపై ఐద్వా, సిఐటియు ఆగ్రహం

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో దారుణం చోటుచేసుకుంది. 9 సంవత్సరాల బాలికపై అదే ప్రాంతానికి చెందిన 55 సంవత్సరాల వృద్ధుడు గోపీ అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. స్థానికులు అందించిన వివరాల మేరకు ఇందిరమ్మకాలనీకి చెందిన బాలిక సోమవారం స్కూలుకు వెళ్లి ఇంటికి వచ్చింది. పెదనాన్న ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో గోపీ అనే వృద్ధుడు ఆ బాలికతో మాటలు కలిపాడు. 'తిరుపతికి వెళ్ళి వచ్చాము. నీకు, నీ తమ్ముడికి తిరుపతి ప్రసాదం లడ్డు ఇస్తా'నని తన ఇంటిలోకి తీసుకువెళ్లాడు. వరుసకు తాత కావడంతో ఆమె నమ్మి ఇంటిలోకి వెళ్ళింది. కొద్దిసేపు మాయ మాటలు చెప్పి. వంట గదిలోకి తీసుకువెళ్లి ఆ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆసమయంలో ఆమె గట్టిగా కేకలు వేసింది. గట్టిగా కేకలు వేయరాదని అమ్మాయిపై వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతలో ఎవరో తలుపు కొట్టిన చప్పుడు రావడంతో తలుపు తీయగానే బాలిక పారిపోయింది. జరిగిన సంగతి బాలిక అక్కడున్నవారికి చెప్పింది. వెంటనే ఆ ప్రాంత ప్రజలు, బంధువులు గోపిని స్తంభానికి కట్టేసి, ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి గోపీని అదుపులోకి తీసుకున్నారు. బాలికను ఉదయం తీసుకురావాలని బంధువులకు సూచించారు. వెంటనే బాలికను వైద్య పరీక్షలకు పంపాల్సి ఉన్నప్పటికీ పోలీసుల నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. బాలిక తల్లి ఆశా వర్కర్. ఆమె తోటి ఆశా వర్కర్లు, సిపిఎం, కె.వి.పి.ఎస్ నాయకులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. బాలికకు జరిగిన అన్యాయంపై అడిగి తెలుసుకున్నారు. అందరు కలిసి వన్ టౌన్ స్టేషన్ వద్దకు వచ్చారు. అయితే స్టేషన్ నిందితుడి కుర్చీల కుర్చోబెట్టి ఉన్న దృశ్యాన్ని చూసిన వారు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే నిందితుడిని కస్టడిలోకి తీసుకుని బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ అసుపత్రికి పంపాల్సిన పోలీసులు ఇలా నిర్లక్ష్యం చేయడంపై మండిపడ్డారు. అయినప్పటికీ పోలీసుల్లో కనీస చలనం సైతం రాలేదు. చివరకు బంధువులతో కలిసి నాయకులు ఆ చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసినప్పటికీ పోలీసులు కనీసం ఒక మహిళ కానిస్టేబుల్‌ను సైతం వెంట పంపలేదు. విషయం తెలిసిన వెంటనే సిడిపిఒ తో పాటు ఐసిడిఎస్ సూపర్వైజర్, ఆ ప్రాంత అంగన్వాడి కార్యకర్త ఆసుపత్రికి వచ్చారు. వీరి సమక్షంలో వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా : 9 సంవత్సరాల బాలికను నమ్మించి ఇంటిలోకి తీసుకువెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడిన మానవమృగం గోపిని కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, ఐద్వా, ఆశా వర్కర్ల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు సిఐటియు నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వీధికి ఒక బెల్ట్‌షాపు పెట్టడంతో మద్యం తాగిన కొన్ని మానవమృగాలు ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నాయన్నారు. కట్టడి చేయాల్సిన పోలీసులు అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మల్లా వ్యవహరిస్తున్నారని అందుకే ఇలాంటి దారుణాలు చోటు చేసుకొంటున్నాయని విమర్శించారు. ఇప్పటికైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మత్తుపదార్థాల విచ్చలవిడి విక్రయాలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన మానవమృగాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటి తహశీల్దార్ మైనూద్దీన్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా, ఆశ వర్కర్ యూనియన్ నాయకులు జ్యోతమ్మ, మమత, అనీత, లక్ష్మిదేవి, రత్నమ్మ, గంగమ్మ, సరస్వతి తో పాటు ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, మంత్రులు సవిత, సత్యప్రసాద్

సిఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవాలలో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ పుట్టపర్తికి వచ్చారు. ఈ మేరకు వారికి పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి గన్నవరం విమానశ్రయం నుండి నేరుగా పుట్టపర్తి కి చేరుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి 5.30గంటలకు చేరుకున్నారు . పుట్టపర్తి విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి రాష్ట్ర రెవిన్యూ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, ఎంపీ బికేపార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు, మాజీ మంత్రివర్యులు పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, ప్రముఖ టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్, కూటమి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుట్టపర్తి విమానశ్రయ పరిసర ప్రాంతాల్లో గట్టి భద్రత ఏర్పాట్లను నిర్వహించారు.

వడ్డీ వ్యాపారుల చేతిలో మహిళ మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలకేంద్రానికి చెందిన మహిళ వడ్డీవ్యాపారుల దాడిలో మృతిచెందింది. ఈఘటనకు సంబంధించిన పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. శాంతమ్మ అనే మహిళ మండలకేంద్రంలోని దొరిగల్లు రోడ్డు స్టేట్ బ్యాంకు దగ్గర టి స్టాల్, కూల్ డ్రింక్ షాపు నడుపుతోంది. వీరు తమ అవసరార్థం అనంతపురం నవోదయ కాలనీ కి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి దగ్గర 30 వేలు రూపాయలు10రూపాయల వడ్డీ కి తీసుకున్నారు. అప్పు చెల్లింపు విషయంపై మంగళవారం మండలకేంద్రంలో శాంతమ్మ, అమె భర్తను రామకృష్ణకు చెందిన మనుషులు నిలదీశారు. ఈ విషయంలో వారి మధ్య తోపులాట జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో శాంతమ్మ మృతిచెందింది. ఆమె భర్తకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెడ్డి జెఏసి అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

రెడ్డి జేఏసీ అధ్యక్షుడు వెంకటేష్ రెడ్డిని స్థానిక జర్నలిస్టులు మంగళవారం సన్మానించారు. ఆయన గత సంవత్సరం దాదాపు 70 మంది జర్నలిస్టులకు సొంత ఖర్చులు వెచ్చించి పోస్టల్ బీమా చేయించారు. ఈ బీమా జర్నలిస్టు అల్లీపీరా ఎంతగానో ఉపయోగపడింది. ఇటీవల అల్లీపీరా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. నాడు వెంకటేష్ రెడ్డి చేయించిన బీమా ఆ జర్నలిస్టుకు అపన్న హస్తంగా మారింది. అందుకు కృతజ్ఞతగా వెంకటేష్ రెడ్డిని మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని అజీజియా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ సెలెక్టెడ్ ఉపాధ్యాయులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బోధించే సమయంలో ఎలాంటి పద్ధతులు వాడాలి, లీప్ యాప్ ను ఏ విధంగా ఉపయోగించాలి, గత సంవత్సరం డేటా అనాలసిస్ ఎలా చేయాలి లాంటి విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఎంఇఒలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, అజీజియా హెచ్‌ఎం సామ్రాజ్యం, రిసోర్స్ పర్సన్లు ఎం రాజు, జగదీష్, ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, మాధవి లత, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాల సహకార సంఘ స్థలం కబ్జాకు యత్నం

అడ్డుకున్న రైతులు



స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన షెడ్డును తొలగిస్తున్న పాడి రైతులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రాంతంలో వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి పరిశ్రమ రానురాను దిగజారి పోవడంతో ఆ పరిశ్రమకు చెందిన స్థలాలపై కబ్జాదారుల కన్ను పడింది. లక్షల రూపాయలు విలువ చేసే స్థలాన్ని హస్తగతం చేసుకునేందుకు విఫలయత్నం చేశారు. 1983లో ప్రారంభించిన హిందూపూర్ కోఆపరేటివ్ మిల్క్ సప్లై యూనియన్ లిమిటెడ్ భవనాన్ని ఏడాది క్రితం గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రి కూల్చివేశారు. అందులో ఉన్న రూ. 20 లక్షల విలువ చేసే పాల శీతలీకరణ యంత్రాలు, పాలక్యాన్లు, ఇనుప పెట్టె, పత్రాలను తీసుకెళ్లిపోయారు. ఆ సమయంలో రైతులు హిందూపురం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే తాజాగా సోమవారం రాత్రికి రాత్రి ఆ ఖాళీ స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసి కబ్జా చేయడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పాడి రైతులు నిర్మాణం చేసిన షెడ్డును మంగళవారం తొలగించారు. సూగూరు సడ్లపల్లి, పోచనపల్లి, ధనాపురం, శాసనకోట తదితర గ్రామాల రైతులు పాల ఉత్పత్తి చేసి పాలు సరఫరా చేయడానికి ఒక కేంద్రాన్ని సొంత నిధులు వెచ్చించి స్థలాన్ని కొనుగోలు చేసి అందులో పాల డైరీ ఏర్పాటు చేసుకుని సొసైటీ ద్వారా డైరీ నిర్వహించేవారు. అయితే కాలక్రమేణా ప్రైవేట్ డైరీలు రావడంతో ఏ గ్రామానికి ఆ గ్రామంలో ప్రైవేటీ డైరీలకు పాలు వేసుకోవడంతో హిందూపూర్ కోఆపరేటివ్ మిల్క్ సప్లై యూనియన్ లిమిటెడ్ కార్యకలాపాలు తగ్గిపోయి మూతపడింది. దీన్ని అదునుగా భావించిన కబ్జాదారులు ఆ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. రహదారికి పక్కనే ఉండడంతో లక్షల రూపాయలు విలువ చేసే స్థలాన్ని రాత్రికి రాత్రే కైవసం చేసుకునేలా ప్రయత్నించారు. ఇప్పటికైనా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందించి రైతులకు సంబంధించిన పాల డైరీ భవనాన్ని పునర్నిర్మాణం చేయించి తమకు న్యాయం చేయాలని పాడి రైతులు కోరారు. కాగా రాత్రికి రాత్రి గుర్తు తెలియని దుండగులు వేసిన షెడ్డును ముందు భాగాన్ని రైతులు ఆగ్రహంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు రైతులను రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులకు ఫిర్యాదు చేయాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదనిచెప్పడం గమనార్హం. సంవత్సరం క్రితం పక్కాభవనాన్ని కూల్చితేనే పోలీసులు ఇప్పటి వరకు కూల్చిన వారిని పట్టుకోలేదని, కూటమి ప్రభుత్వంలో ఎక్కడికక్కడ దౌర్జన్యాలు కబ్జాలు పెరిగిపోయాయని పాడి రైతులు ఆరోపిస్తున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి : వ్యకాసం

ప్రజాశక్తి-పెనుకొండ



ధర్నాలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి హరి

రెండేళ్లుగా ఇంటిపట్టాల కోసం పోరాటం చేస్తున్న పేదలకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యకాసం ఆధ్వర్యంలో పేదలతో కలిసి బైటాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి హరి మాట్లాడుతూ పట్టణంలో సర్వే నెంబర్ 668లో రెండేళ్ల క్రితం ఇళ్లు లేని నిరుపేదలు కొట్టాలు వేసుకుని అక్కడే నివాసం ఉన్నారన్నారు. అధికారులు పేదలు వేసుకున్న కొట్టాలను బలవంతంగా తొలగించారన్నారని చెప్పారు. దీనిపై బాధితులు హైకోర్టును అశ్రయించారన్నారు. రెండు నెలల్లోపు పేదలకు పట్టాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో పేదలు మరోసారి కొట్టాలు వేసుకున్నారని తెలిపారు. వాటిని అధికారులు మళ్లీ బలవంతంగా తొలగించారన్నారు. దీనిపై బాధితులు కోర్టును అశ్రయించగా కొట్టాలను కూల్చివేసిన వారికి నోటీసులు వచ్చాయన్నారు. నివాస స్థలం లేని పేదలకు ఇంటి కోసం స్థలం ఇవ్వడంలో అధికారులు ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహయ కార్యదర్శి గంగాధర్, వెంకట రాముడు, సివిల్ సప్లయ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సిఐటియు నాయకులు తిప్పన్న, ఇళ్ల స్థలాల పోరాట సంఘం నాయకురాలు సౌమ్య, అర్చన, ఆంజినప్ప, కొల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రజాశక్తి- హిందూపురం

ఇటీవల వైసిపి స్థానిక కార్యాలయంపై జరిగిన దాడి సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటం ధ్వంసమయింది. ఈ నేపథ్యంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి సూచన మేరకు మంగళవారం రాష్ట్ర ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి సమితి అధ్యక్షులు కెబి శంకరయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం టిడిపి కార్యకర్తలు స్థానిక వైసిపి కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేసి పార్టీ కార్యకర్తల మీద భౌతిక దాడులు జరిపి, అక్కడున్న భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటాన్ని ధ్వంసం చేశారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని, రాజ్యాంగాన్ని అవహేళన చేయడానికి నిరసిస్తూ అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. వైసిపి కార్యాలయంపై దాడి చేసి అంబేద్కర్ చిత్రపటాన్ని ధ్వంసం చేసి రాక్షసానందం పొందిన నాయకులను మందలించకుండ్డా తన ఎదుట ముందు వరుసలో కూర్చోబెట్టుకొని ప్రజలకు ఏమి సందేశం ఇవ్వాలనుకున్నారో ఎమ్మెల్యే బాలకృష బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి కార్యాలయంపై దాడి చేసిన సంఘటనకు సంబంధించి తెలుగుదేశం పార్టీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమానుల్లా, జంగం చందు, లేపాక్షి మండలం వైస్ ఎంపీపీ అంజన్ రెడ్డి, జే. వెంకటేష్, శబరీష్, హనుమంతప్ప, నాగభూషణ, మనోజ్, శ్రీనివాసులు, సతీష్ బాబు, శ్రీరాములు, వాల్మీకి వెంకటేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు జాకబ్ మృతి

పలువురు సంతాపం

ప్రజాశక్తి-హిందూపురం

జర్నలిజంలో గత 40 ఏళ్లుగా పనిచేసిన సీనియర్ జర్నలిస్ట్ జాకబ్ మంగళవారం మృతి చెందారు. ఈయన మృతికి పలువురు జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఓడిసికి చెందిన జాకబ్ పలు పత్రికలలో జర్నలిస్టుగా పనిచేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో పత్రిక రంగంలో ప్రత్యేకమైన ముద్ర వేసుకున్నారు. ఈయన పత్రికా రంగంలో దాదాపు 40 ఏళ్లుగా కొనసాగారు. జాకబ్ మృతి వార్త తెలుసుకున్న ఉమ్మడి అనంతరం జిల్లా జర్నలిస్టులు జాకబ్ మృతదేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



నివాళులు అర్పిస్తున్న పాత్రికేయులు


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు తురకలాపట్నం విద్యార్థులు

ప్రజాశక్తి-రొద్దం

ఉమ్మడి అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 బాల, బాలికలకు సాఫ్ట్ బాల్ పోటీల్లో మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు బి.ప్రణీత్ సాయి రాజ్, జి.దీక్షిత రెడ్డి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వెంగప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణ, పీడీ రామకృష్ణ ఉపాధ్యాయులు అభినందించారు.

బహుజన చైతన్య వేదిక మండల కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో బహుజన చైతన్య వేదిక మండల కమిటీని మంగళవారం ఎంపిక చేశారు. అధ్యక్షులుగా మంచేపల్లి మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా పెయింటర్ రామాంజి, ఉపాధ్యక్షులుగా సంజీవ రాయుడులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుకొండ రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగేపల్లి నాగరాజు, రొద్దం బాబు, రామాంజినప్ప పాల్గొన్నారు.

అయోధ్యకు సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన యువకుడు అయోధ్య రాముడిని దర్శించుకోవడానికి సైకిల్ యాత్రను చేపట్టారు. మంగళవారం నాడు మండలంలోని గంటాపురం గ్రామం నుంచి సైకిల్‌లో అయోధ్యకు బయల్దేరాడు. గంటాపురంలో ఇటీవల అధునాతనంగా నిర్మించిన రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సైకిల్‌పై అయోధ్యకు వెళ్లారు.

20న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం ఉషోదయ పాఠశాల ఎదురుగా ఈనెల 20వ తేదీ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రక్త బంధం ఆర్గనైజేషన్ నిర్వాహకులు కన్నా వెంకటేష్, చంద్రమౌళి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం పట్టణ ప్రముఖులు సంధా రాఘవ పుట్టినరోజు సందర్భంగా 20వ తేదీన ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలని కోరారు. రక్తదానం చేసేదాతలు 9731135903, 9177501081 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రూ.5లక్షల ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మొలకవేములకు చెందిన టిడిపి కార్యకర్త రూపేంద్ర ఆరు నెలల క్రితం ప్రమాదంలో మరణించాడు. ఈయనకు టిడిపి సభ్యత్వం ఉన్న నేపథ్యంలో ప్రమాద బీమా రూ.5లక్షలు మంజూరైంది. ఈ సాయాన్ని ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మృతుని తండ్రి మల్లికార్జునకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల మనోహర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చింత చెట్లు వేలం

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని కోకిల పంచాయతీలో ఉన్న చింత చెట్లకు పంచాయతీ అధికారులు వేలం పాటను మంగళవారం నిర్వహించారు. 46 చింత చెట్లను వేలంలో రూ.66,500కు కోగిర గ్రామానికి చెందిన దాదెప్ప గారి అంజినేయులు దక్కించుకున్నాడని పంచాయతీ కార్యదర్శి రామచంద్రారెడ్డి తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి మడకశిర టౌన్

మండల కేంద్రంలో పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన సదస్సును ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కిష్టప్ప ఎన్ఎస్ఎస్‌సి విద్యార్థులతో మంగళవారం నిర్వహించారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. పర్యావరణ పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, మురికి కాలువల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

ప్రజాశక్తి-అగళి

సిడిపిఒ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను మంగళవారం నాడు మండల కేంద్రంలో నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు చిన్నారులతో ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు. బాలల హక్కుల గురించి తెలియజేశారు. బాలలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియజేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


బాలల హక్కులపై ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున

ప్రజాశక్తి-కదిరి టౌన్

తిరుపతి నగరంలో డిసెంబర్ 12 ,13 ,14వ తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, బాబ్‌జాన్ తెలిపారు. మంగళవారం పట్టణంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 12న ర్యాలీ బహిరంగ సభ ఇందిర మైదానంలో జరుగుతుందన్నారు. రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది ఎంపిక చేయబడిన ప్రతినిధులు పాల్గొని రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు, విద్యాభివృద్ధిపై చర్చిస్తారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. బకాయి ఫీజు రీయింబర్స్, స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని కోరారు. బుక్కపట్నం మండలంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో సత్యసాయి యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. నారాలోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై 25వ రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యశ్వంత్, దామోదర్, అఖిల్, ఖలందర్, మహేష్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

లోటుపాట్లు రానీయొద్దు

వైద్య,కుటుంబ సంక్షేమ అధికారి డా॥పద్మజ


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డా॥పద్మజ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో తమ శాఖ తరపున ఎలాంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్యం, కుటుంబం సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ కె.పద్మావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పని చేసి బాబా జయంతి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హాస్పిటల్‌లో ప్రజలలో ఆరోగ్యం పైన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎల్ఈపి ఆఫీసర్ ఐడిఆర్ ఎస్.దేవసాగర్, జెడి డాక్టర్ బి.సునీల్ కుమార్ నాయక్, ఎన్‌పిసిబి రామనాథ రావు, రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామ గిడ్డయ్య, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజ్ బేగం పాల్గొన్నారు.

సహకార సంఘం వారోత్సవాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

72వ అఖిల భారత సహకార వారోత్సవాలను కదిరి రూరల్ మండలం మల్లయ్య గారిపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం నిర్వహించారు. సహకార వారోత్సవాల జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సంఘం ఇన్‌ఛార్జి రామచంద్ర నాయుడు, సిబ్బంది బయరెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణమూర్తి , డైరెక్టర్లు రెడ్డెమ్మ, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 72వ సహకార వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈవో మంజునాథ్ గురుమూర్తి, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప, మారుతి ప్రసాద్, క్లస్టర్ కో కన్వీనర్ చెన్నప్ప, చంద్రప్ప, మదనకుంట రఘు, నిరంజన్ పాల్గొన్నారు.


మల్లయ్యగారిపల్లి సహకార సంఘంలో జెండా ఎగురవేస్తున్న సభ్యులు, అధికారులు


కొండకమర్లలో ఉలవలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

సబ్సిడీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-ఓబుళదేవర చెరువు

మండల వ్యాప్తంగా ఉన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి ఇలియాజ్ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుల జిరాక్స్ పత్రాలు తీసుకెళ్లి రైతు సేవ కేంద్రం అధికారులను సంప్రదించాలని కోరారు. మండల పరిధిలోని కొండకమర్ల గ్రామ రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ ఉలవలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి షఫీ అహ్మద్, రాజారెడ్డి, బడిశం రామాంజనేయులు, తెలుగురైతు మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ జాకీర్ అహ్మద్, శంకరయ్య, సాదిక్ వలి, మండల ఒడియ రాజుల సంఘం అధ్యక్షుడు ఇటుగుట్టు ఆంజనేయులు, గంగాద్రి, రామాంజనేయులు, చౌడప్ప, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని రైతుసేవా కేంద్రంలో 80 శాతం సబ్సిడీతో రైతులకు ఉలవలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్, రైతుసేవా కేంద్రం సిబ్బంది నారాయణ స్వామి, శిరీష ఆధ్వర్యంలో రైతులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర్, బలిరెడ్డి, మైలే రామచంద్ర, బాబావలి పాల్గొన్నారు.

వైసిపి పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీకి సన్మానం

ప్రజాశక్తి-గాండ్లపెంట

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కమిటీ సెక్రటరీ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని స్థానిక వైసిపి నాయకులు మంగళవారం సన్మానించారు. మండల కేంద్రలోని వైఎస్ఆర్, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కార్యకర్తలు పూలమాలలు, శాలవాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ అధ్యక్షుడు మేకల నరసింహులు, మండల ఎస్సీ అధ్యక్షుడు ఎం.కొండయ్య శంకర నాయుడు, పామిడి మహమ్మద్, ఇక్బాల్ బావుద్దీన్, ఆటో బాబు, చలపతి పాల్గొన్నారు.


చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

క్వారీ, మైన్స్ సరిహద్దుల పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తనకల్లు

మండల పరిధిలో క్వారీలు, మైన్స్‌లు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైనంపై మంగళవారం నాడు ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ షాబుద్దీన్ మండల వ్యాప్తంగా జరుగుతున్న మైన్స్ వివరాలను సేకరించారు. చదుం పంచాయతీ అగ్రహారంపల్లి సర్వేనెంబర్ 21లోని క్వారీ సరిహద్దులను ఆర్ఐ అశోక్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. క్వారీ సరిహద్దులను సమగ్రంగా పరిశీలించి సర్వే చేసి రిపోర్టు అందించాలని సర్వేయర్లను ఆదేశించారు. మైన్స్, యజమానికి సంబంధించి అధికారులు ఇచ్చిన పరిమితి ప్రకారం వాటికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని ఆదేశించారు.


మైన్స్ సరిహద్దులను పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-లేపాక్షి

మండలం పరిధిలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు శేషగిరి బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు. ఈనెల 16వ తేదీన అనంతపురం ఆర్‌డిటి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బేస్ బాల్ పోటీలలో పాఠశాలకు చెందిన లోహిత్ కుమార్, నౌషద్, లలితలు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యారన్నారు. ఈనెల 27,28,29వ తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో జరిగే రాష్ట్ర పోటీల్లో వీరు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలియజేశారు. విద్యార్థుల ఎంపికపై ఉపాధ్యాయులు హితేంద్ర, శిరీషదేవి, శ్రీనివాసరావు, ఆనంద్ రెడ్డి, రవి అభినందనలు తెలిపారు.

ఆసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో గత పది నెలలుగా ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అయేషా, మేస్త్రి అక్రంబాషా, షెక్షా, జామియా మసీదు ముతువల్లి మహమ్మద్, కార్యదర్శి కుళ్లాయప్ప, గూని కుళ్లాయప్ప, అన్సర్‌బాషా, షాషా, త్యాగి, బాబ ఫకృద్దీన్ పాల్గొన్నారు.


గర్భిణులకు అన్నదానం చేస్తున్న ముస్లిములు

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆదినారాయణ యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని శాఖల అభివృద్ధి, సమస్యలపై చర్చ జరిపారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపిపి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శకుంతల, వైస్ ఎంపీపీ వెంకట్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాచారచన, చిత్రలేఖ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివయ్య చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన వకత్వ, చిత్రలేఖనం పోటీలను మంగళవారం నిర్వహించారు. 40 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి మల్లికార్జున తెలిపారు.

రొద్దం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ఉన్నత పాఠశాల, టీచ్ కాన్వెంట్ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వాహించినట్లు గ్రంథాలయ అధికారి నాగరాజు తెలిపారు. స్వచ్ఛభారత్, స్వర్ణాంధ్ర, గ్రంథాలయ అవశ్యకతపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

బత్తలపల్లి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం నాడు విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలను గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. బత్తలపల్లి విద్యాధరి హైస్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రొద్దంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


విద్యార్థులను సన్మానిస్తున్న ప్రముఖులు

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి-గోరంట్ల

ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను గ్రంథాలయంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ జిఎం.సురేష్ మాట్లాడుతూ గోరంట్ల మండలానికి చెందిన రోహిత్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. రోహిత్‌కు తమవంత సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ గౌరవ అధ్యక్షులు రామలింగారెడ్డి, రిటైర్డ్ ఆర్డీవో విశ్వనాథ్, ప్రిన్సిపాల్ భక్తవత్సలం, అభివృద్ధి కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు దేవరహట్టిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని దేవర హట్టి గ్రామంలో రైతులకు పిఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ నిధులు విడుదల సందర్భంగా బుధవారం నాడు రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగల్ విండో అధ్యక్షులు మద్దన కుంటప్ప, కార్యదర్శి శ్రీనాథ్, డైరెక్టర్ ప్రకాష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి చిత్ర శేఖర్ యాదవ్ తెలిపారు. అర్హులైన రైతులందరికీ ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేవరహట్టి గ్రామంలో అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించే స్థలాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, న్యాయవాది శివకుమార్ పరిశీలించారు.

బాబా జయంతి ఉత్సవాలకు మహిళలు

ప్రజాశక్తి-పరిగి

శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పరిగి మెడికల్ షాప్ నిర్వాహకుడు నర్సియప్ప ఆధ్వర్యంలో మహిళలకు పుట్టపర్తికి మంగళవారం వెళ్లారు. తమ వంతుగా సాయంగా మంగళవారం రెండు బస్సుల్లో బాబా భక్తులను పుట్టపర్తికి తీసుకెళ్లామని నర్సియప్ప తెలిపారు.

మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని బూదిలి గ్రామం వద్ద తండాకు చెందిన శంకర్ నాయక్ సోమవారం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి మంగళవారం నాడు బూదిలి తండాకు వెళ్లి మతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ, గంధం బాలాజీ, ఈడిగ రవి, శేషాద్రి, శ్రీరాములు, బయప్ప, ఈడిగ, కుమార్ పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎంపిపి విద్యాధరణి

మహిళ ఆత్మహత్యను రాజకీయాలతో ముడిపెట్టొద్దు

ప్రజాశకి-బత్తలపల్లి

మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామంలో జరిగిన మహిళ ఆత్మహత్యను రాజకీయాలకు ముడిపెట్టొద్దని వైసిపి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నాడు బత్తలపల్లిలో నిర్వహించిన మండల వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు, వైసీపీ మండల ఉపాధ్యక్షుడు బ్యాళ్ల పెద్దయ్య తదితరులు మాట్లాడారు. డబ్బుల విషయంలో కూరే ప్రమీల, ఆమె పొలంలో పనిచేసిన కూలీలకు మధ్య ఘర్షణ జరిగిందన్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు మరసటి రోజు విచారిస్తామని ప్రమీల కుటుంబ సభ్యులకు తెలిపారు. రాత్రి ఇంట్లో ప్రమీల ఒంటరిగా నిద్రించి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈ ఘటనను బిజెపి నాయకులు రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. వైసిపి నాయకుల వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుందని చెప్పడం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా బిజెపి నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద లైట్లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల కేంద్రంలోని పెనుగొండ రహదారిలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద లైట్లు ఏర్పాటు చేయాలని సౌత్ వెస్ట్రన్ రైల్వే జిఎం మొబైల్ శరన్ మాతూర్‌కు మండల మానవ హక్కుల సంఘం నాయకుడు పాపన్న, ప్రశాంతిలు మంగళవారం నాడు వినతిపత్రం అందజేశారు. ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్లో ఆయన్ను కలిసి సమస్యను విన్నవించారు. ఈ ప్రాంతం నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలిని కోరారు.


సమస్యను వివరిస్తున్న పాపన్న

లక్ష్మీనర్సప్పకు సన్మానం

ప్రజాశక్తి-గుడిబండ

సింగల్ విండో కార్యాలయంలో మంగళవారం నాడు గుడిబండ మండలం టిడిపి కన్వీనర్ లక్ష్మీ నరసప్పను సింగల్ విండో డైరెక్టర్ ప్రకాష్ సన్మానించారు. లక్ష్మినరసప్పకు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు మద్దన కుంటప్ప, మాజీ ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ శివకుమార్, సహకార సంఘం సీఈవో రాజన్న, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ హరీష్ బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ పిఎల్.కాంతారావు, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ బి.యశోద రాణి, శ్రీహరి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు